సాక్షి వరంగల్

సోమవారం | 6 | నవంబర్ | 2023



సోలార్ వెలుగుల్లో మరియపురం టాప్

సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటులో మరియపురం గ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది.

- 10లో



18న 'చాంబర్' ఎన్నికలు

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎన్నికలు ఈనెల 18న నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్ తెలిపారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 31°/23°

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై, గాలిలో తేమ ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కార్యకర్తలను కాపాడుకుంటా..



రాయపర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ నాసర్, ఎండీ యాకూబ్‌పాషా, ముదిరాజ్‌కులస్తులు కత్తి ఉప్పలయ్య, మోతె అంజయ్య, కత్తి వెంకన్న మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్ ప్రజావాణి రద్దు : కలెక్టర్

వరంగల్ : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈవిషయాన్ని గమనించి జిల్లా పరిధిలోని ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రాకూడదని ఆమె కోరారు.

క్రీడాకారిణి దీప్తికి రూ.లక్ష చెక్కు అందజేత



పర్వతగిరి : పారా ఏసియా గేమ్స్‌లో భాగంగా 400 మీటర్ల పరుగు పందెంలో కల్లెడకు చెందిన క్రీడాకారిణి దీప్తి గోల్డ్‌మెడల్ సాధించింది. ఎస్‌ఈబీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఏఎఫ్‌ఐ ప్రెసిడెంట్ ఆదిల్ సుమారివాలా, నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, టైటిల్ స్పాన్సర్ ఏజీస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఆమెకు రూ.లక్ష చెక్కు అందజేశారు.

మా ఓటు చల్లా ధర్మారెడ్డికే..



గీసుకొండ : మా ఓటు బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి వేస్తామంటూ గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ పోగుల అగయ్యనగర్‌కు చెందిన పలువురు ఆదివారం తీర్మానించారు. ఈ మేరకు 15, 16 డివిజన్ల కార్పొరేటర్లు ఆకులపల్లి మనోహర్, సుంకరి మనీషాశివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, పలువురు నాయకుల సమక్షంలో వారు ప్రతిజ్ఞ చేశారు.

డీఎస్‌పీ మేనిఫెస్టో విడుదల



వర్ధన్నపేట: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) వర్ధన్నపేట అభ్యర్థి దొడ్డ మురళీకృష్ణ వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీ టు పీజీ విద్య, ప్రతి ఏటా రూ.33 వేల కోట్ల బడ్జెట్‌తో ఆధునిక విద్య, రూ.33 వేల కోట్లతో వైద్యం, రూ.33 వేల కోట్లతో ఉపాధి, పేద రైతులకు వేతనాలు, రైతు కూలీలు, చిన్న సన్నకారు రైతులకు ప్రతి నెల రూ.5 వేల వేతనం, దళితులకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు, పేదలకు నాలుగు గదుల ఇళ్ల నిర్మాణం, సంపూర్ణ మద్యనిషేధం, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, ఉద్యోగాల కల్పన తదితర అంశాలతో మేనిఫెస్టో అమలు చేస్తామని తెలిపారు. బర్ల నగేష్, బరిగెల బాబు, దామెర అరుణ్, నస్కూరి రాజేందర్, కొత్తూరు జయపాల్, బలపాక నాగరాజు పాల్గొన్నారు.

ఓటు..బ్రహ్మాస్త్రం



- దేశ గతిని మార్చే శక్తివంతమైన ఆయుధం
- ప్రజాస్వామ్య పాలనకు పునాది
- రంగశాయిపేట డిగ్రీ కళాశాల విద్యార్థుల మనోగతం

అభ్యర్థులూ అలర్ట్..

- ప్రచారానికి ఎన్నికల సంఘం నిబంధనలు
- రాత్రి 10 గంటలు దాటితే గప్‌చుప్..
- గైడ్‌లైన్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలే..

- వివరాలు 10లో

ప్రతిభకు పట్టం.. కళా ఉత్సవం

- నేటి నుంచి విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు
- 6, 7వ తేదీల్లో మండలస్థాయి, 9, 10 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహణ
- 9 నుంచి 12వ తరగతి చదివే వారికి అవకాశం
- విజేతలకు నగదు బహుమతి, మెడల్స్, ట్రోఫీల ప్రదానం
- జిల్లాలో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు

కాశీబుగ్గ సెంటర్ : విద్యార్థులకు చదువుతోపాటు కళారంగంలో దాగి ఉన్న కళానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు విద్యాశాఖ పాఠశాలల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనుంది. విద్యార్థుల్లో ఉన్న సహజ కళలను ప్రోత్సహించేందుకు, ఏకమత్యం, దేశ సమగ్రత, భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించేందుకు బాలల దినోత్సవం సందర్భంగా కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. సమగ్రశిక్ష పాఠశాల విద్యాసంచాలకుల ఆదేశానుసారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాల (ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ)ల్లో 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కళా ఉత్సవ్‌లో అవకాశం కల్పించారు. మొదట మండల స్థాయిలో ఈనెల 6వ తేదీ (సోమవారం) నుంచి 7వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తారు. ఈనెల 9 నుంచి 10వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఈ కళా ఉత్సవ్ పోటీలు 10 అంశాల్లో ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



కళా ఉత్సవ్ లోగో

కళా ఉత్సవ్‌లో నిర్వహించే పోటీల వివరాలు..

- గాత్ర సంగీతం, శాస్త్రీయ సంగీతం
- గాత్ర సంగీతం జానపద
- వాయిద్య సంగీతం (తబలా, తంబూర, కంజర, డప్పు, డ్రమ్ము తదితర పరికరాలు)
- వాయిద్య సంగీతం మెలోడీ (గిటార్, ఫ్లూట్, జైలోఫోన్ తదితర పరికరాలు)
- నృత్యాలు
- విజువల్ ఆర్ట్ –2డీ పెయింటింగ్, డ్రాయింగ్, ఫొటోగ్రఫీ
- విజువల్ ఆర్ట్–3డీ శిల్పకళ, క్రాఫ్ట్, వీడియో మేకింగ్
- శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, భరత నాట్యం)
- ఇండిజీనస్ గేమ్స్, టాయ్స్, బొంగరం, చిర్రగోనె, అష్టాచెమ్మా, బొమ్మల కొలువు, తొక్కుడు బిల్ల, కొండపల్లి బొమ్మలు
- నాటిక (డ్రామా) ఏకపాత్రాభినయం

10 విభాగాల నుంచి బాలురు, బాలికల్లో ఒకరు చొప్పున (10+10) 20 మందిని ఎంపిక చేస్తారు. ఇలా 13 మండలాల నుంచి 260 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తారు. విజేతలకు ప్రశంసపత్రంతో పాటు నగదు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.25 వేల నగదు, రెండో బహుమతి రూ.20 వేల నగదు, మూడో బహుమతి రూ.15 వేలతోపాటు మెడల్స్, ట్రోఫీలు ప్రదానం చేస్తారు. కాగా, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జాతీయ స్థాయి కళాఉత్సవ్ పోటీలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

కళలను ప్రదర్శించడానికి వేదిక..



సమగ్రశిక్ష పాఠశాల విద్యాసంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యజమాన్యాల పాఠశాల (ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ)ల్లో 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కళా ఉత్సవ్‌లో అవకాశం కల్పించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను ప్రదర్శించడానికి ఇది ఒక మంచి వేదిక. ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహిస్తారు. కళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు పోటీలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలి.

– డి.వాసంతి, డీఈఓ

ఇంకా నిరీక్షణే..!

- ఆ మూడు చోట్ల తేలని అభ్యర్థిత్వాలు
- డోర్నకల్‌లో కాంగ్రెస్, ములుగు, నర్సంపేటలో.. బీజేపీ అభ్యర్థులపై ఇంకా సస్పెన్స్
- కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లో మూడు నియోజకవర్గాలకు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ఇంకా అభ్యర్థులను తేల్చలేదు. ఓవైపు ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ సాగుతోంది. మరోవైపు నామినేషన్లకు నాలుగు రోజుల గడువే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలక ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఉమ్మడి వరంగల్‌లో రెండు నెలల క్రితమే బీఆర్‌ఎస్ 11 స్థానాలకు పోటీచేసే అభ్యర్థులను ప్రకటించింది. గత నెల 16న జనగామ అభ్యర్థిని ప్రకటించగా.. ప్రచారంలో ఆ పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు విడతల్లో మొత్తం 11 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. డోర్నకల్‌పై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బీజేపీ కూడా రాష్ట్రస్థాయిలో మూడు విడతలుగా అభ్యర్థులను ప్రకటించగా.. ములుగు, నర్సంపేట నియోజకవర్గాలకు ఇంకా ఎవరనేది తేల్చలేదు. నామినేషన్ల గడువు దగ్గర పడుతున్నకొద్దీ ఆ రెండు పార్టీల శ్రేణుల్లో ఆందోళన పెరుగుతోంది.

నిరీక్షణకు తెరపడేదెప్పుడు..

ఎన్నికల నామినేషన్ల గడువు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల విజయం కోసం ఆ పార్టీ నియోజకవర్గాలకు ఏఐసీసీ పరిశీలకులను కూడా నియమించింది. డోర్నకల్‌కు అభ్యర్థి లేనప్పటికీ.. అక్కడ ఐ.తుకారాంకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. డోర్నకల్ నుంచి ఎనిమిది మంది వరకు దరఖాస్తు చేసుకున్నా.. ప్రధానంగా రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, భూపాల్‌నాయక్ పోటీ పడుతున్నారు. మహబూబాబాద్ నుంచి ఆశించిన కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బెల్లయ్యనాయక్‌కు అక్కడ అవకాశం దక్కక డోర్నకల్ కోసం పోటీ పడుతున్నారు. దీంతో అధిష్టానం ఐదుగురిలో చివరికి ఎవరివైపు మొగ్గు చూపుతుందోనన్న చర్చ జరుగుతోంది. అలాగే బీజేపీ నుంచి నర్సంపేట బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి పరకాల అభ్యర్థిగా మారారు. దీంతో ఇక్కడ ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు, మరో ఇద్దరు టికెట్ రేసులో ఉండగా.. సరైన అభ్యర్థి కోసం చూస్తున్నట్లు చెబుతున్నారు. ములుగు నుంచి కృష్ణవేణి నాయక్, భూక్య జవహర్‌లాల్ తదితరులు మొదటి నుంచి పోటీ పడుతుండగా.. ఇటీవలే పార్టీలో చేరిన మాజీమంత్రి చందూలాల్ కుమారుడు అజ్మీరా ప్రహ్లాద్ గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అధిష్టానం అక్కడ అభ్యర్థి ప్రకటన విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది. మొత్తంగా మరో నాలుగు రోజులే నామినేషన్లకు గడువున్న నేపథ్యంలో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడంపై ఆశావహుల్లో అసహనం పెరుగుతోంది.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



దుగ్గొండి: గుడ్డేలుగులపల్లిలో ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న దొంతి మాధవరెడ్డి



నర్సంపేట : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాధవరెడ్డి

- కాంగ్రెస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఐదో వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకులు పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ కార్యదర్శి చిప్పనాగ ఆధ్వర్యంలో దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే, నర్సంపేట పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు కందగట్ల టాక రాజు, ఉపాధ్యక్షుడు కందగట్ల నాగరాజు, బూత్ అధ్యక్షుడు కందగట్ల శివకుమార్, బీజేపీ ఓబీసీ విభాగం ప్రధాన కార్యదర్శి కల్లూరి వీరభద్రచారి, దేవేంద్రచారితోపాటు పలువురు, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఆరు కుటుంబాలు, ఖానాపురం మండల కేంద్రానికి చెందిన బీజేపీ గ్రామ అధ్యక్షుడు సామ మల్లారెడ్డి, రాపాక వెంకటనర్సయ్య కాంగ్రెస్‌లో చేరారు. వారికి దొంతి మాధవరెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఆరు గ్యారంటీలతో కారు బేజారు

దుగ్గొండి : ఆరు గ్యారంటీల హామీతో కారు పార్టీ రాష్ట్రంలో బేజారు అవుతుందని కాంగ్రెస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని గుడ్డేలుగులపల్లి, ముద్దునూరు, మైసంపల్లి, స్వామిరావుపల్లి, జాఫర్‌పల్లి, కేశవాపురం, లక్ష్మీపురం, బంధంపల్లి, దేశాయిపల్లి, గుడిమహేశ్వరం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచించి చేతిగుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పాలాయి శ్రీనివాస్, చుక్క రమేష్, ఎర్రల్ల బాబు, కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, పెండ్యాల రాజు, బొల్లెపల్లి రాము, మాచర్ల దేవేందర్, వేముల ఇంద్రదేవ్, సరిగె ప్రవీణ్‌కుమార్, పాదిల నరేష్, కోరె రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది

నర్సంపేట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే పల్లెలు సమగ్ర అభివృద్ధి చెందాయని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని నర్సింగాపురం, ఇటుకాలపల్లి, ఆకులతండా, ఇప్పల్‌తండా, కొండసముద్రంతండా, ఏనుగల్‌తండా, ముత్యాలమ్మతండా, జంగాలపల్లితండా, ముత్తోజిపేట, రామవరం, రంగంపల్లి, లక్నెపల్లి, మగ్గి నర్సయ్యపల్లి గ్రామాల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలు బతుకమ్మలు, మంగళహారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా పెద్ది మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి, 135 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు డయాగ్నోస్టిక్, మెడికల్ కళాశాల తదితర వాటిని తీసుకొచ్చామన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని తెలిపారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులతోపాటు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించామని తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఎంపీపీ మోతె కళావతి, జడ్పీటీసీ కోమాండ్ల జయమ్మ, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మోతె జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి

విద్యార్థులు సంఘటితంగా పోరాడాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు

నర్సంపేట : విప్లవ విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో ఉచిత, నాణ్యమైన శాస్త్రీయ విద్య కోసం సంఘటితంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జెండాలు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించి నర్సింహారావు మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నరేంద్రమోదీ, ఇంటికో ఉద్యోగంతోపాటు ఉద్యోగం లేని వారికి నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్.. గెలిచిన అనంతరం హామీలను తుంగలో తొక్కారన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, జిల్లా నాయకులు వినయ్, రాజు, సిద్ధు, డివిజన్ నాయకులు అనంద్, నవీన్, వెంకటేష్, తిరుపతి, హరిబాబు, ప్రశాంత్, వంశీ, అజ్మాన్, అలీ, విజయ్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.



వారోత్సవాల్లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

అటకెక్కిన ఆటలు!

- కేయూలో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్లు ఏవీ?
- సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ పోటీలకు లేని ఎంపికలు
- జనరల్ బాడీ సమావేశం ఊసే లేదు
- మరిచిన స్పోర్ట్స్ బోర్డ్ క్రీడల క్యాలెండర్
- పోటీల కోసం విద్యార్థుల నిరీక్షణ

కేయూ క్యాంపస్: 'ఆటలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి. చదువుతోపాటు ఆటల్లో రాణించాలి' ఇలాంటివి సందర్భమొచ్చినప్పుడల్లా అధికారులు చెబుతూనే ఉంటారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉంది. కేయూ పరిధిలో 2023–24 క్రీడల నిర్వహించలేదు. ఇప్పటివరకు ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ పోటీలు కూడా నిర్వహించలేదు. కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 287 డిగ్రీ కళాశాలలతోపాటు వివిధ పీజీ కళాశాలలు, ఇంజనీరింగ్, ఫార్మసీ, విద్యాకళాశాలలు, లా కళాశాలలున్నాయి. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా డాక్టర్ సవితాజ్యోత్స్న వ్యవహరిస్తున్నారు. ఈఏడాది ఆగస్టు–సెప్టెంబర్‌లోనే స్పోర్ట్స్ బోర్డు జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించాలి. అందులో క్రీడా పోటీల క్యాలెండర్‌ను రూపొందించాలి. క్రీడాపోటీలను ఏయే జిల్లాలో ఎక్కడ నిర్వహించాలనేది కూడా ఖరారు చేస్తారు. దీనికి వీసీ రమేశ్ అప్రూవల్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, నవంబర్ వచ్చినా సమావేశం నిర్వహించలేదు. అసలు ఈసారి పోటీలు నిర్వహిస్తారా.. టోర్నమెంట్లకు ఎంపికలు చేస్తారా లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీలకు సన్నద్ధతేది?

యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపినవారిని సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పంపించాల్సి ఉంటుంది. అలాగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కూడా పంపిస్తారు. ఇది ప్రతీ ఏడాది జరిగేదే. కానీ కరోనా తర్వాత ఒక సంవత్సరం కాలేజియేట్ టోర్నమెంట్లు నిర్వహించలేదు. గతేడాది మొక్కుబడిగా నిర్వహించి ఎంపికలు పూర్తి చేశారనే ఆరోపణలున్నాయి. ఈఏడాది ఈప్రక్రియపై దృష్టి సారించకపోవడంతో క్రీడాకారులు నష్టపోయే పరిస్థితి ఉంది.



కేయూలోని స్పోర్ట్స్ బోర్డు భవనం

క్రీడాంశాలు ఇవీ..

యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించే వాలీబాల్, చెస్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రికెట్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, టేబుల్ టెన్నిస్, టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైతే వివిధ యూనివర్సిటీల్లో జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కూడా అథ్లెటిక్స్, ఆర్చరీ, బాల్‌బ్యాడ్మింటన్, బాక్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ తదితర పోటీలుంటాయి. కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో నవంబర్ 9 నుంచి 12వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలను (మెన్) నిర్వహిస్తోంది. కానీ.. కేయూ నుంచి కబడ్డీ జట్టును ఎంపిక చేయలేదు. చండీఘర్ యూనివర్సిటీ మొహాలి పంజాబ్‌లో డిసెంబర్ 15 నుంచి 22 వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఎక్కడెక్కడ ఆయా టోర్నమెంట్లు ఉన్నాయో.. అందుకు సంబంధించిన సమాచారం యూనివర్సిటీకి కూడా వస్తుంది. అందుకు అనుగుణంగా యూనివర్సిటీ నుంచి జట్లను ఎంపిక చేయాలి. కానీ.. ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

రుసుము రూ.60 నుంచి రూ.300

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లోని ప్రతీ విద్యార్థి నుంచి క్రీడా రుసుము కింద రూ.60 నుంచి రూ.300కు పెంచారు. ఒకేసారి ఐదు రెట్లు పెంచడంపై విమర్శలు వస్తున్నాయి. ఇలా రూ.కోట్లలోనే వర్సిటీ స్పోర్ట్స్ బోర్డుకు రుసుము రూపేణా అందుతుంది. కానీ.. యూనివర్సిటీలో క్రీడాకారులకు కావాల్సిన వసతుల కల్పన లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూనివర్సిటీపై భారం లేకున్నా క్రీడల నిర్వహణలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

పీడీ పోస్టు ఖాళీ..

కేయూలో స్పోర్ట్స్ బోర్డుకు ఫిజికల్ డైరెక్టర్ రెగ్యులర్ పోస్టు కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. స్పోర్ట్స్ బోర్డు నిర్వహణలో కీలకంగా ఉండాల్సిన గ్రౌండ్‌మెన్ ఉద్యోగి పోస్టు కూడా భర్తీ చేయాల్సి ఉంది. గేమ్స్ బాయ్స్‌గా ప్రస్తుతం ముగ్గురు తాత్కాలిక ఉద్యోగులు పని చేస్తున్నారు. కనీసం ఆరుగురు ఉండాలి. ఈ పోస్టులను సైతం భర్తీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



కేయూ పరిధి కళాశాలల్లో వెంటనే పోటీలు నిర్వహించాలి. కరోనా తర్వాత ఒక సంవత్సరం ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌ను కూడా నిర్వహించలేదు. గతేడాది మొక్కుబడిగా నిర్వహించి ఎంపికలు చేసి కోచింగ్ సరిగ్గా లేకుండానే పంపారు. ఈ ఏడాది అది కూడా లేదు. దేశంలోని ఇతర యూనివర్సిటీల్లో పోటీల తేదీలు ఖరారయ్యాయి. కేయూ విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు నిర్లక్ష్యం వీడి స్పోర్ట్స్ క్యాలెండర్ రూపొందించాలి.

– డాక్టర్ సోమన్న, ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

భారీ మెజార్టీకి కృషిచేయాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్



నాచినపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్

దుగ్గొండి : నర్సంపేటలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు ఎప్పుడో ఖాయమైందని, భారీ మెజార్టీ కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నాచినపల్లి గ్రామంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ బరోసా పేరుతో విడుదల చేసి మేనిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మమతామోహన్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధర్మారెడ్డి, డైరెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీరామోజు ప్రభాకర్, రవీందర్, గోపాల్‌రెడ్డి, తిరుపతి, రాము, మురారి, ఖాజీ, వంశీ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వస్తూ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన ఓ కుటుంబం కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తున్నది. డ్రైవర్, యజమాని నాంచారయ్య సహా నలుగురు మహిళలు కారులో ఉన్నారు. ఈ క్రమంలో వర్ధన్నపేట వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి రైస్ మిల్లు సమీపంలోని మలుపు వద్ద నాంచారయ్య అతి వేగంతో వస్తూ కారును విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో కారు పక్కనే ఉన్న బైక్ మెకానిక్ షెడ్‌లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. విద్యుత్ స్తంభం మూడు ముక్కలుగా విరిగిపోయి, తీగలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కారులో ఇరుక్కున్న క్షతగాత్రులను స్థానికులు అతికష్టంతో బయటకు తీశారు. కాగా, వారు స్వల్ప గాయాలతో బయట పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. వారిని వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కారు అతి వేగం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు పేర్కొన్నారు.



అదుపుతప్పి బోల్తా పడిన కారు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

గీసుకొండ: మండలంలోని మనుగొండకు చెందిన రజక సంఘం నాయకులు ఆదివారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల నాయకుడు రడం భరత్ ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు చాపర్తి సమ్మయ్య రాజు, నాగరాజు, సాంబయ్య, చేరాలు, రంజిత్, సుధాకర్, సారయ్యతో పాటు సుమారు వంద మంది బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కులవృత్తుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు.



చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన రజక సంఘం నాయకులు



రాజకీయాలు యుద్ధం కన్నా ప్రమాదకరమైనవి. యుద్ధంలో ఒకసారి మరణిస్తే రాజకీయాల్లో ఎన్నోసార్లు మరణిస్తారు.

- విన్‌స్టన్ చర్చిల్

పంట క్షేత్రాలు వదిలి.. ప్రచారం !



ప్రచారంలో పాల్గొన్న కూలీలు

ఎన్నికల వేళ కూలీలకు భారీ గిరాకీ ఉంటోంది. ప్రచారంలో పాల్గొంటే ఒక్కొక్కరికి రూ. 100 లభిస్తోంది. ఉదయం రెండు గంటలు ఒక పార్టీ..సాయంత్రం రెండు గంటలు మరో పార్టీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా సమయాల్లో ఆయా పార్టీల నాయకులు కూలీలకు టీ, టిఫిన్ బోనస్‌గా అందజేస్తున్నారు. ఫలితంగా కూలీలు ప్రచార పర్వంలో నిమగ్నమవుతున్నారు. ఇందులో మహిళలే ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. రెండు, మూడు రోజుల నుంచి మండల కేంద్రంలో పలు రాజకీయ పార్టీలు పోటాపోటీ ప్రచారం నిర్వహిస్తున్నాయి. అయితే వీరి రాజకీయం ఎలా ఉన్న వ్యవసాయదారులు మాత్రం కూలీలు లభించక అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంటలు చేతికొందిన సమయంలో కూలీలు లభించకపోవడంతో నష్టపోయే ప్రమాదం ఉందని, దీనిపై రాజకీయ పార్టీ నాయకులు స్పందించి ప్రత్యామ్నాయంగా ప్రచారం నిర్వహించాలని పలువురు అన్నదాతలు ప్రాధేయపడుతున్నారు.

- గోవిందరావుపేట

ఈ ముచ్చటెరుకనా ?

చెల్లని ఓట్లకు కాలం చెల్లింది

కాజీపేట: బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించే సమయంలో చెల్లని ఓట్ల శాతం ఎక్కువుండేది. అప్పుడు ఓటు రెండు గుర్తులపై పడడం, సరిగ్గా ముద్ర పడకపోవడం, ఓటు వేయకుండానే ఖాళీ బ్యాలెట్ పత్రాలను బాక్సుల్లో వేసేవారు. ఇలాంటి వాటిని అధికారులు చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. గతంలో పలు సందర్భాల్లో గెలిచిన అభ్యర్థులకు వచ్చిన ఓట్ల మెజార్టీ కన్నా చెల్లని ఓట్లే అధికంగా వచ్చిన సందర్భాలున్నాయి. సాంకేతికత పెరిగి ఈవీఎంలు రావడంతో చెల్లని ఓట్లు లేకుండా పోయాయి.

సిటీని చుట్టేసి.. ప్రలోభాల్ని పట్టేసి!




ఎన్నికల వేళ ప్రలోభాలకు తావివ్వకుండా.. నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్ వరంగల్‌ను చుట్టేసి ఏ మూలన ఏం జరిగినా.. మూడో కన్ను (సర్వేలెన్స్) తో నిక్షిప్తం చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వాహనాలు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

జంగ్ తెలంగాణ

అభ్యర్థులూ అలర్ట్..

ప్రచారానికి ఎన్నికల సంఘం నిబంధనలు

- రాత్రి 10 గంటలు దాటితే గప్‌చుప్..
- ప్రభుత్వ మైదానాలు, ఆస్తులు వాడొద్దు
- సభల నిర్వహణకు పోలీసుల అనుమతి తీసుకోవాలి
- గైడ్‌లైన్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలే..



కాజీపేట: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తస్మాత్ జాగ్రత్త. నిబంధనల మేరకే ప్రచారం నిర్వహించాలి. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీని ప్రకారం నాయకులు, కార్యకర్తలు ఉదయం 6 గంటల తర్వాతే ప్రచారం ప్రారంభించాలి. రాత్రి 10 గంటల కల్లా ముగించాలి. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బహిరంగ సభలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చీరలు, బొక్కాలు, ఇతర దుస్తులు, క్రీడా పరికరాలు తదితర వస్తువులు పంపిణీ చేస్తే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు భావిస్తారు. టోపీలు, కండువాలు మాత్రం ఇవ్వొచ్చు. కానీ వాటి ఖర్చును అభ్యర్థి ఎన్నికల పద్దులో రాయాల్సి ఉంటుంది. ప్రచారం చేసే అభ్యర్థి ఎన్ని వాహనాలనైనా ఉపయోగించుకునే వీలుంది. కానీ ముందస్తు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాలి. అనుమతి పత్రం స్పష్టంగా కనిపించేలా వాహనానికి అంటించాలి. పర్మిట్ మీద వాహన నంబర్, అభ్యర్థి వివరాలు ఉండాలి. ఓ అభ్యర్థి పేరిట పొందిన పత్రాన్ని మరో అభ్యర్థి ప్రచారానికి వినియోగిస్తే చర్యలు తీసుకుంటారు. కరపత్రాలు ముద్రించే అభ్యర్థులు తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ప్రచురించాలి.

బహిరంగ సభల సందర్భంగా...

బహిరంగ సభ ఏర్పాటు చేసే ప్రదేశం, తేదీ, సమయం ముందుగా పోలీసు అధికారులకు తెలిపి, రాత పూర్వకంగా అనుమతి తీసుకోవాలి. అలా అయితే పోలీసులే ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ ఏర్పాట్లు పరిశీలించే అవకాశం ఉంటుంది. సభ ఏర్పాటు చేసే ప్రదేశం.. ప్రభుత్వ ఆస్తులు, దేవాలయాలకు సంబంధించి ఉండొద్దు. ప్రైవేట్ ఆస్తులైతే సంబంధిత స్థలం యజమాని నుంచి లిఖిత పూర్వక అనుమతి తీసుకోవాలి. సభ ఏర్పాటు చేసే స్థలం శాంతిభద్రతల దృష్ట్యా అభ్యంతరకరం కాదని నిర్ధారించుకోవాలి. సభకు మైక్ వినియోగానికి పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. సభను అడ్డుకోవడం, గొడవ సృష్టించడం లాంటి ముప్పు కలిగించే శక్తులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం అందించి వారి సాయం తీసుకోవాలి.

ఊరేగింపుల్లో..

ప్రతి అభ్యర్థి తమ ఊరేగింపు ఆరంభమయ్యే సమయం, సాగే రూట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే ప్రదేశాలు, ముగింపు సమయం ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఊరేగింపు సాగే మార్గంలో, సమావేశాలు నిర్వహించే ప్రదేశాల్లో ఎలాంటి ఆంక్షలు లేవని పోలీసు అధికారుల నుంచి నిర్ధారించుకోవాలి. అభ్యంతరాలుంటే మార్గం మార్చుకోవాలి. ఊరేగింపుల్లో అందరూ పోలీసులు సూచించిన విధంగా రోడ్డుకు ఒక పక్కన సాగుతూ క్రమ శిక్షణతో మెలగాలి. వేర్వేరు పార్టీలు ఒకే మార్గంలో, ఒకే సమయంలో ఊరేగింపులు తీయడానికి పోలీసులు అనుమతించరు. ఒకరికొక్కరు ఎదురు పడకుండా చూసుకోవడం ఉత్తమం. ఊరేగింపుల్లో పాల్గొనేవారు ఏ విధమైన మారణాయుధాలు, విపరీత శబ్దాలు కలిగించే పేలుడు పదార్థాలు వెంట తీసుకురాకుండా అభ్యర్థులు, వారి అనుచరులే చూసుకోవాలి. ఊరేగింపులు, సభలు, సమావేశాల్లో ప్రతిపక్షాల దూషణలు, వ్యక్తిగత విమర్శలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలి.



ఓటు.. బ్రహ్మాస్త్రం

దేశ గతిని మార్చే శక్తివంతమైన ఆయుధం

- ప్రజాస్వామ్య పాలనకు పునాది
- ఓటు వేయడం హక్కే కాదు.. బాధ్యత కూడా..
- రంగశాయిపేట డిగ్రీ కళాశాల విద్యార్థుల మనోగతం

ఖిలా వరంగల్: ఓటు.. రాజ్యాంగం ప్రసాదించిన శక్తివంతమైన ఆయుధం. ప్రజాస్వామ్యానికి పునాదైన ఓటును ప్రలోభాలకు ముడిపెడితే భవిష్యత్తు అంధకారమే. ఓటును అమ్ముకోకుండా స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలి. అప్పుడే ఎన్నికైన ప్రజాప్రతినిధులను నిలదీసి పనులు చేయించుకోవచ్చు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య మనుగడను దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలి. కాగా, ప్రతి విద్యార్థి ఓటు విలువను తల్లిదండ్రులకు తెలియజేసి సుపరిపాలనకు అవకాశం కల్పించాలని వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థుల ఓటు హక్కు వినియోగంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.



రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్


నిస్వార్థపరులకే ఓటు



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరు మంచి వారు? గెలిచాక అభివృద్ధి చేస్తారా? లేదా? అనే విషయాలను పరిగణనలోకి తీసుకుంటా. ప్రజాసమస్యలు తీర్చగలిగే అభ్యర్థినే ఎన్నుకుందాం. డబ్బుకు ఆశపడి ఓటును అమ్ముకోవద్దు. ప్రలోభాలకు లొంగొద్దు. నిస్వార్థపరులకే ఓటు వేద్దాం.

- మద్దూరి రుచిత, డీఎస్సీ మూడో సంవత్సరం

ఓటు వజ్రాయుధం



ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ. ఓటు వజ్రాయుధం. ఓటు హక్కును వినియోగించుకుందాం. దీని విలువను నాయకులకు తెలియజేద్దాం. ఓటు వేయడంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దు. ఓటుకు దేశ గతిని మార్చే సత్తా ఉంది. ఓటు వేసి మార్పును చూపిద్దాం

- ఎండీ లాయిక్, బీజెడ్సీ, మూడో సంవత్సరం


మంచి నాయకుడికే మద్దతు



ఓటు మాత్రమే దేశ ప్రజల తలరాతను మార్చగలదు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో మంచి నేతను ఎన్నుకోవాలి. ఎవరు ఎన్ని చెప్పినా క్షణం ఆగి మంచి, చెడును నిర్ణయించుకోవాలి. నిజాయితీ గల నేతను ఎంచుకోవాలి. విద్యా, వైద్యం, అభివృద్ధి కృషి చేసే నమ్మకమైన నేతకే ఓటు వేయాలి.

- ఎం. శ్రీవల్లి, బీఎస్సీ, రెండో సంవత్సరం

ప్రభావాలకు లొంగొద్దు



విలువైన ఓటును కుల, మత, ప్రాంత ప్రభావాలకు లొంగి దుర్వినియోగం చేయొద్దు. నాయకులు ఇచ్చే డబ్బుకు లొంగొద్దు. బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరూ ఇష్టం లేకుంటే నిర్భయంగా నోటాకు ఓటు వేయాలి.

- కొట్టెం ప్రవళిక, బీఏ ప్రథమ సంవత్సరం

ఓటుతోనే సమాజంలో మార్పు



ఓటుతోనే సమాజంలో మార్పు వస్తుంది. ఓటు హక్కు కాదు.. బాధ్యత కూడా. ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేసే వ్యక్తికే ఓటేస్తాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సవ్యంగా అమలు చేసే వారినే ఎన్నుకుంటాం. ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రగతికి కృషి చేసే వ్యక్తిని ఎన్నుకునేందుకు నావంతు ప్రయత్నం చేస్తా.

- పసుల సమంత్, బీఏ మూడో సంవత్సరం

యువత పాత్ర కీలకం



రాష్ట్ర భవిష్యత్తు, మన ప్రగతిని మనమే నిర్ణయించుకునే హక్కు మన చేతుల్లోనే ఉంది. ఓటు వజ్రాయుధం. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమే. గ్రామం నుంచి దేశం వరకు ప్రగతి సాధించాలంటే యువకులు బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొనాలి. కర్తవ్యంగా భావిస్తేనే మంచి నేతను ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుంది.

- సాయి, బీఎస్సీ మూడో సంవత్సరం

యువత మనస్తత్వం తెలుసుకోవాలి



యువత మనస్తత్వం తెలుసుకునే నాయకుడినే ఎన్నుకోవాలి. రాష్ట్ర, ప్రాంత అభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకునే నాయకుడే కావాలి. ప్రజల కనీస అవసరాలు తీర్చగలిగే నేతను ఎంచుకోవాలి. డబ్బు పంచే వ్యక్తి గెలిచిన తరువాత ప్రజల నుంచి ఎక్కువ రాబట్టాలని చూస్తుంటారు. అలాంటి నేత అభివృద్ధిపై దృష్టి సారించరు. నిజాయితీ పరులైన అభ్యర్థులను గెలిపించాలి.

- బైరబోయిన సౌమ్య, బీఏ ప్రథమ సంవత్సరం

నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకోవాలి



ఎన్నికల్లో పోటీ చేసే నాయకుడికి నిజాయితీ ఉండాలి. నాయకుడు నిస్వార్థంగా చేసిన వాగ్దానాలన్నీ నిలుపుకో గలిగే వాడై ఉండాలి. ప్రజలందరికీ విద్యా, ఉద్యోగావకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలి. రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలి. ప్రచారంలో ఇచ్చే హామీలను నెరవేర్చే సత్తాగల నాయకుడి ఎన్నుకోవాలి.

- కె. రవళి, బీఏ ప్రథమ సంవత్సరం

ఉన్నత వ్యక్తిత్వం ఉండాలి



నాయకుడికి మంచి వ్యక్తిత్వం ఉండాలి. ప్రజలు తన వారేననే భావం కలిగి ఉండాలి. మద్యం, గంజాయి, గుట్కా విక్రయాలు నిషేధించాలి.యువత సంక్షేమానికి కృషి చేయాలి. ఉచిత పథకాలను ప్రవేశ పెట్టకుండా నిత్యావసర ధరల తగ్గింపుపై దృష్టి సారించాలి.

- రంజిత్, బీఎస్సీ మూడో సంవత్సరం

కాంగ్రెస్ ప్రచారంలో ఉద్రిక్తత

- దూసుకొచ్చిన బీఆర్‌ఎస్ ప్రచార రథం
- కాంగ్రెస్ కార్యకర్తల దాడి.. ఫ్లెక్సీ చింపిన వైనం



బీఆర్‌ఎస్ ప్రచార రథంపై దాడిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రచార యాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వాస్తవానికి ఎన్నికల నియమావళి ప్రకారం ఒక పార్టీ ప్రచార కార్యక్రమం జరుగుతుండగా.. మరో పార్టీ ప్రచారం వధం అటువైపు వెళ్లకుండా దారి మళ్లించాలి. అయితే పరకాల బస్టాండ్ కూడలిలో ఒక వైపు కాంగ్రెస్ కార్నర్ సమావేశం జరుగుతుండగానే.. రెండుసార్లు బీఆర్‌ఎస్ ప్రచార రథం అటువైపు దూసుకొచ్చింది. దీంతో ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకొని.. ఆ రథం డ్రైవర్‌పై మండిపడ్డారు. పోలీసులు నచ్చజెపుతుండగానే కొందరు బీఆర్‌ఎస్ ప్రచార రథానికి ఉన్న ఫ్లెక్సీని చింపివేశారు. అక్కడే కాంగ్రెస్ రథంపై ఉన్న రేవూరి.. దాడి చేయొద్దు.. పోలీసులు చూసుకుంటారని నచ్చజెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే కాంగ్రెస్ ప్రచారం మొదటి రోజే పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో మూడు ప్రధాన పార్టీల ప్రచారాల్లో ఎలాంటి గొడవలు చోటుచేసుకుంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రూ. 93వేల విలువైన వెండి స్వాధీనం



వెండిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

స్టేషన్ ఘన్‌పూర్: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో జనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పెందోట అజయ్ ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 93వేల విలువైన వెండిని స్వాధీనం చేసుకున్నామని సీఐ నల్ల రాజు తెలిపారు. పట్టుకున్న వెండిని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేశారు.

ఎండు గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న ఏసీపీ

కాజీపేట: కాజీపేట బస్టాండ్ ప్రాంతంలో రూ.2.75 లక్షల విలువైన 11 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. బిహార్‌కు చెందిన శత్రుదన్ భోగేందర్ మహతో కొద్ది కాలంగా గంజాయి విక్రయాలు చేపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం బిహార్ నుంచి తీసుకొచ్చిన గంజాయిని కాజీపేట ప్రాంతంలో విక్రయించడానికి యత్నిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు సార్ల రాజు, బాబులాల్, సంజీవ రావు, ఎస్సైలు వంశీకృష్ణ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

18న 'వరంగల్ చాంబర్' ఎన్నికలు

- 9 నుంచి నామినేషన్ల స్వీకరణ..
- 14న ఉప సంహరణ.. అభ్యర్థుల జాబితా విడుదల
- పోలింగ్ రోజే ఫలితాల వెల్లడి




వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన కార్యవర్గం ఎంపికకు ఈనెల 18న ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్ తెలిపారు. అక్టోబర్ 12న ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో తీర్మానించిన ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనను ఈనెల 3 జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమోదించినట్లు పేర్కొన్నారు. 2023-24, 2024-25, 2025-26(మూడేళ్లు) గాను చాంబర్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారితో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యుల ఎంపికకు శనివారం(ఈనెల 18న) ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చాంబర్ కార్యాలయంలో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల పరిశీలన, 14వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, 18వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్, అదే రోజు సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారని వివరించారు. ప్రముఖ న్యాయవాది చకిలం ఉపేందర్‌ను ఎన్నికల అధికారిగా నియమించినట్లు వేదప్రకాశ్ తెలిపారు.

పేరు ఒకరిది.. ఉత్తర్వులు మరొకరివి

- చూసుకోకుండా ఆర్డర్స్ కాపీపై డీడీ సంతకం



ఎర్రయ్య పేరుతో ఉన్న ఉత్తర్వు లెటర్, సర్కిల్‌లో డీడీ పోచం సైన్

ఏటూరునాగారం: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పలువురు ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం ఉత్తర్వులు జారీ చేశారు. కానీ లెటర్ హెడ్ మహబూబాబాద్ డీటీడీఓ ఎర్రయ్య పేరుతో ఉంది. సంతకం ఐటీడీఏ డీడీ పోచం చేయడం గమనార్హం. భూపాలపల్లి జిల్లా పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు నాగేంద్రకు ఆరోగ్య సమస్య ఉండడంతో డీడీ పోచం.. అతడిని రిలీవ్ చేస్తూ సీనియర్ ఉపాధ్యాయుడు అంజయ్యకు హెచ్‌ఎం బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కింది స్థాయి ఉద్యోగులు.. లెటర్ హెడ్‌లో ఒక పేరు, కింద ఉత్తర్వులు పరిశీలించకుండానే జారీ చేశారు. దీంతో లెటర్ హెడ్‌లో ఒక పేరు, ఉత్తర్వులు ఇచ్చేది మరొకరు కావడంతో ఆర్డర్స్ అందుకున్న వ్యక్తులు గందరగోళానికి గురవుతున్నారు. చదువుకున్న వారు కూడా ఇలా తప్పిదం చేస్తుంటే గిరిజన విద్య ఎంత మేర నడుస్తోందో అర్థమవుతోందని పలువురు గిరిజనులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ బదిలీ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

నయీంనగర్ : కేసీఆర్ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం టీజేఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరాం మాట్లాడారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌తో పోల్చితే వరంగల్ నగరం అభివృద్ధిలో వెనకబడిందన్నారు. కేసీఆర్ పాలనను అంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తాము మద్దతు ఇస్తున్నామన్నారు. ఉద్యమకారులు, మేధావులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఏకమై బీఆర్‌ఎస్ ఓటమి కోసం 25రోజులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో దోపిడీ పాలన చేసిన బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జావీద్, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రజాసంఘాల బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సోలార్ వెలుగుల్లో మరియపురం టాప్

- ఉమ్మడి వరంగల్‌లో ప్రథమ స్థానం



గ్రామంలోని ఓ ఇంటిలో సోలార్ విద్యుత్ మీటరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం సోలార్ విద్యుత్ విషయంలో అరుదైన రికార్డు సాధించింది. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి కృషి, చొరవతో ప్రజలు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటులో ఉమ్మడి వరంగల్‌లోనే ప్రథమ స్థానంలో నిలిచారు. పొదుపు సంఘాల మహిళలు స్త్రీనిధి రుణ సహాయంతో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోగా.. కొందరు గ్రామస్తులు స్వతహాగా ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 16 మంది సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని తమ అవసరాలకు పోగా మిగతా కరెంటును విద్యుత్‌శాఖ వారికి విక్రయిస్తున్నారు. ప్రతి యూనిట్ విలువ రూ.1.44 లక్షలు ఉండగా అందులో రూ.29 వేల సబ్సిడీ పోనూ సర్పంచ్ ఒక్కొక్కరికి రూ. 20 సహాయం అందించారు. దీంతో లబ్ధిదారులు రూ.1,00,134లను 60 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. రెడ్‌కో, సెర్ప్, స్త్రీనిధి, విద్యుత్ శాఖల సమన్వయం.. సహకారంతో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. కాగా, సోలార్ కనెక్షన్లలో మరియపురం ఉమ్మడి వరంగల్‌లో మొదటి స్థానంలో ఉండగా, రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచినట్లు రెడ్‌కో డీఎం మహేందర్‌రెడ్డి తెలిపారని సర్పంచ్ పేర్కొన్నారు.